క్లుప్తంగా

సన్మానం



నల్లబెల్లి : ఎంపీడీఓగా ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా నర్సింహమూర్తిని సతీస మేతంగా మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు గురువారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. నర్సింహమూర్తిని ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మూడు దశాబ్దాలకుపైగా విధులు నిర్వర్తించారని తెలిపారు. తొలుత నర్సింహమూర్తి అతడి తల్లికి పాదాభివందనం చేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఊడుగుల సునీత, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ విజయ్‌కుమార్, కార్యాలయ సూపరింటెండెంట్ అబిద్ అలీ, ఎంపీఓ రవి, ఎంఈఓ అనురాధ, ఏపీఓ వెంకట్‌నారాయణ, నాయకులు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, గందె శ్రీనివాస్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు స్పందన

నర్సంపేట : పట్టణంలోని సిద్దార్థ డిగ్రీ, పీజీ కళాశాల సౌజన్యంతో కనెక్టిట్యూడ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో వివిధ కంపెనీలు గురువారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు స్పందన లభించింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గోగుల సృజన ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. సుమారు 10 ప్రైవేటు సంస్థల ప్రతినిధులు 256 మంది నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 124 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ రమేశ్ నాయక్, కంపెనీ ప్రతినిధి హెచ్‌ఆర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



నెక్కొండ : మండలంలోని రెడ్లవాడకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ ఆవుల చంద్రయ్యను అతడి తల్లి సోమక్క ఇటీవల మృతి చెందిన క్రమంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరామర్శించారు. తొలుత సోమక్క చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, పాలాయి శ్రీనివాస్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బక్కి అశోక్, కుసుమ చెన్నకేశవులు, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు తిరుమల్, మాదాటి శ్రీనివాస్, నాయకులు సుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి, హరిప్రసాద్, శివకుమార్, వేణుగోపాల్, భీమ్‌రావు, రాజు, సూర్య, వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట మండలంలో..

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని 16 చింతల్‌తండాకు చెందిన బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు భానోత్ గణేశ్ అనారోగ్యానికి గురి కాగా ఆయన్ను, ధర్మాతండాకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త భూక్య బాలు తల్లి వాలీ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని, పాపయ్యపేటకు చెందిన మండల ప్రధాన కార్యదర్శి భూక్య రవీందర్‌నాయక్‌ను అతడి సోదరుడు ఈర్యనాయక్ ఇటీవల మృతి చెందిన క్రమంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారు. పెద్ది వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాల్నె వెంకన్న, మాజీ జెడ్పీటీసీ భానోతు పత్తినాయక్, మాజీ ఎంపీపీ జక్క అశోక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు కొండవీటి ప్రదీప్‌కుమార్, అమ్మ రాజేశ్, మాజీ సర్పంచ్ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావి తాజా మాజీ సర్పంచ్ కూస సమత భర్త రాజు (45) అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందగా ఆయన మృతదేహానికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చుక్క రమేశ్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ యూత్ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, తదితరులు రాజు మృతదేహానికి నివాళులర్పించారు.

4వ వార్డులో..

నర్సంపేట : పట్టణంలోని 4వ వార్డుకు చెందిన ఆలకుంట మల్లయ్య ఇటీవల మృతి చెందగా ఆయన చిత్రపటానికి బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ, రైతు సమన్వయ సమితి రాష్ట్ర సభ్యుడు రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మనోహర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. తొలుత మల్లయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, పట్టణ ప్రచార కార్యదర్శి శ్రీనివాస్, శివరాత్రి స్వామి, 4వ వార్డు అధ్యక్షుడు సంపంగి సాలయ్య, పట్టణ యువజన నాయకులు సంతోశ్, రాపోలు రాములు, రాపోలు రవి, తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల రక్షణలో జాగ్రత్తలు కీలకం

- వర్షాకాలంలో ముందస్తు టీకా తప్పనిసరి
- వ్యాధులు, నివారణపై పశు వైద్యాధికారి రాజు సూచనలు



సంగెం : వర్షాకాలంలో సాధారణంగా మూగ జీవాలకు వ్యాధులు సోకడం పరిపాటి. వాటి సంరక్షణలో జాగ్రత్తలు కీలకం. ఈ క్రమంలో సీజనల్‌గా మూగ జీవాలకు సోకే వ్యాధులు, వాటి నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల పశు వైద్యాధికారి డాక్టర్ వల్లె రాజు పలు సూచనలు అందించారు.

నోటివాపు వ్యాధి..

మూగజీవాల్లో వర్షాకాలంలో నోటివాపు లేదా నీలి నాలుక వ్యాధి (బ్లూ టంగ్) వచ్చే అవకాశాలు ఎక్కువ. తీవ్రతను చూపించడంతోపాటు గొర్రెల పోషకులకు తీవ్ర నష్టాన్ని కలుగజేసే అవకాశం ఉంది. ఈ వ్యాధి జీన్స్‌కు చెందిన అర్బి వైరస్ వల్ల వస్తుంది. క్యులికాయిడ్ కీటకాలు కుట్టడం వల్ల వస్తుంది.

వ్యాధి లక్షణాలు..

వ్యాధి బారిన పడిన మూగజీవాలకు 107.5 ఫారెన్‌హీట్ వరకు జ్వరం వచ్చే అవకాశం ఉంది. ఆకలి మందగించడం, ముఖంతోపాటు పెదాలు, ముక్కు, దవడ, కనురెప్పలు, నాలుక వాపు వచ్చి ఉబ్బినట్లుగా కనిపిస్తాయి. దీన్ని నోరు వాపు వ్యాధి అంటారు. నోటి లోపలి భాగంలో పుండ్లు పడడం, శ్లేషం పొర ఊడిపోయి ఎరుపెక్కడం వంటి లక్షణాలు కనపడతాయి. నోటి నుంచి సోల్లు కారడంతో సోల్లు వ్యాధి అని కూడా ప్రచారంలో ఉంది. ముక్కు నుంచి జిగట, చిమిడి కారి పక్కు కట్టి పుండ్లుగా మారుతాయి. దీంతో రక్త ప్రసరణ తగ్గి నాలుక నీలివర్ణంలోకి మారడాన్ని నీలి నాలుక వ్యాధి అంటారు. శ్వాస తీసుకోవడం భారంగా మారి ఊపిరితిత్తుల్లో నీరు చేరుతుంది. కాలి గిట్టలపై భాగం కరోనరీ పట్టి ఇన్ఫెక్షన్ బారిన పడి కుంటుతాయి. సూడి జీవాలకు గర్భస్రావం అయ్యే ప్రమాదం ఉంది. వ్యాధి సోకితే మందలోని 70 శాతం జీవాలకు వ్యాప్తి చెందిన పదుల సంఖ్యలో మరణాలు చోటు చేసుకునే అవకాశం ఉంది.



నీలి నాలుక సోకిన గొర్రె

చికిత్స..

వ్యాధి వైరస్ వల్ల రావడంతో నిర్దిష్టమైన చికిత్స లేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో జ్వరం, నొప్పులు, కుంటడం ఎక్కువగా ఉంటే యాంటీ పైరటిక్, యాంటీ ఇన్ఫ్లమేటరీ మందులు వేయాలి. నోటి పుండ్లు, వాపులు తగ్గేలా యాంటీ మైక్రోబియల్ మందులు వేయాలి. వాపు తగ్గించడానికి డైయూరిటిక్ మందులు వాడాలి. ముఖ భాగాలను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో శుభ్రం చేయాలి.

నివారణ చర్యలు

వ్యాధి నివారణకు అవసరమైన టీకాలు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి కారకమైన క్యులికాయిడ్ కీటకాల బారిన జీవాలు పడకుండా చీకటి పడేకంటే ముందుగానే ఇళ్లకు తొలుకు రావాలి. జూన్, జూలై నెలల్లో ముందస్తుగా టీకా వేయించాలి. టీకా విధానంలో బూస్టర్ డోస్ వేస్తే సత్ఫలితాలిస్తుంది. మొదటి డోస్ అనంతరం 21 రోజుల తర్వాత రెండో డోస్ (బూస్టర్) ఇప్పించి జీవాలను కాపాడవచ్చు.

యూరియా అక్రమ నిల్వతో నష్టం

- ఏడీఏ దామోదర్‌రెడ్డి

నల్లబెల్లి : రైతులు అవసరానికి మించి యూరియా కొనుగోలు చేసి అక్రమంగా నిల్వ చేస్తే నత్రజని విలువలు కాపాడలేక నష్టపోతారని వ్యవసాయ శాఖ సహాయక సంచాలకుడు (ఏడీఏ) దామోదర్ రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని శనిగరంలోని ఆగ్రోస్ కేంద్రాన్ని, మేడపల్లిలోని రైతు పరస్పర సహకార సంఘాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. యూరియా విక్రయాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బిల్ బుక్కులు, స్టాక్ రికార్డు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని బాధ్యులకు స్పష్టం చేశారు. రైతులు అవసరం మేరకే యూరియా కొనుగోలు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ బన్న రజిత, ఏఈఓలు శివకుమార్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆగ్రోస్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న దామోదర్‌రెడ్డి

ఇళ్ల నిర్మాణంలో నిబంధనలు తప్పనిసరి



ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేస్తున్న రంజిత్‌రెడ్డి, నాయకులు

- టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి

నెక్కొండ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చంద్రుగొండ, పెద్దకొర్పోలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేదల సొంతింటి కల సాకారం చేసే ధ్యేయంతో ప్రభుత్వం అర్హులను ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వర్తింపజేస్తోందని తెలిపారు. నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని సూచించారు. లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు పూర్తిస్థాయిలో జమ అయ్యే వరకు అధికారులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బక్కి అశోక్, కుసుమ చెన్నకేశవులు, కోశాధికారి సుబ్బారెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గై లక్ష్మణ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సింగం ప్రశాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రావుల మహిపాల్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు బాదావతు భీమన్న, నాయకులు హరిప్రసాద్, సుధాకర్‌రెడ్డి, యాదగిరి, సాంబయ్య, శ్రీనివాస్, రమేశ్. రాములు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో నిధుల దుర్వినియోగం

- మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య

వర్ధన్నపేట : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎస్టీ, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను దుర్వినియోగం చేసిందని ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు, స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, సీనియర్ నాయకుడు పోశాల వెంకన్న గౌడ్‌తో కలిసి వెంకటయ్య మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని తీసుకొచ్చి ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అభివృద్ధి చేయగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎక్కడ కూడా అభివృద్ధి చేయలేదని చెప్పారు. తండాలను గ్రామ పంచాయతీలుగా ఉన్నతీకరించిన క్రమంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం సర్పంచ్‌లకు కూడా నిధులు మంజూరు చేయకుండా వారి ఆత్మహత్యలకు కారణమైందని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి రూ.17,169 కోట్లు కేటాయించి మూతపడిన కార్పొరేషన్‌ను తెరిపించడంతోపాటు గిరిజన యునివర్సిటీ ఏర్పాటు చేస్తోందని చెప్పారు. గతంలో బీసీలుగా కొనసాగిన గిరిజనులను ఎస్టీ జాబితాలో చేర్చిన ఘనత కాంగ్రెస్ సొంతమన్నారు. కాంగ్రెస్ పార్టీ 1975లో గిరిజనులకు వ్యవసాయ భూములు, ఇండ్ల ప్లాట్లు ఇచ్చి ఇళ్లు కట్టించిందని తెలిపారు. వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా బ్యాంకులను జాతీయం చేసి పెట్టుబడులు కల్పించిందని, పోడు భూముల రక్షణ కోసం 1/70 చట్టాన్ని అమలు చేసిందని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్



రాయపర్తి : మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించిన ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లకు గురువారం స్పాట్ అడ్మిషన్ కల్పించారు. మొత్తం 89 మంది విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించినట్లు ప్రిన్సిపాల్ సరిత మీడియాకు వెల్లడించారు. ఎంపీసీలో ఆరుగురికి, బైపీసీలో 9 మందికి ప్రవేశం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లీల, సృజన, కళమ్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో రేపు..

ఖానాపురం : మండలంలోని బుధరావుపేట మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీట్లకు రేపు (ఈనెల 2న) స్పాట్ అడ్మిషన్ కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఖాళీగా ఉన్న సీట్లకు ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం సెల్ నంబర్ 9948410004, 9177259597ల్లో సంప్రదించాలని సూచించారు.

బియ్యం అందజేత

రాయపర్తి : మండలంలోని గట్టికల్‌కు చెందిన ఇల్లందుల దూడయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు, మాజీ సర్పంచ్ చెవ్వ కాశీనాథం గురువారం బియ్యం సాయంగా అందజేశారు. తొలుత దూడయ్య చిత్రపటానికి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహుల రామ్మూర్తి, సన్నూరి మహేందర్, అరూరి వెంకన్న, సన్నూరి దర్గయ్య, మాదారపు లచ్చయ్య, సన్నూరి వెంకన్న, మాదారపు బాబు, దాసరి రవీందర్, అలువాల సాయిలు, అరూరి సోమన్న, వెంకన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌ఆర్‌ఆర్' ఆధ్వర్యంలో..

మండలంలోని కొలన్‌పల్లికి చెందిన అరూరి నర్సయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు గురువారం తోడ్పాటు అందించారు. తొలుత నర్సయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి బియ్యం, ఆయిల్ క్యాన్ అందజేశారు. అనంతరం తిర్మలాయపల్లికి చెందిన దివ్యాంగుడు బరిగెల సమ్మయ్యకు ట్రైసైకిల్ రిపేరు కోసం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో రూ.3 వేల నగదు అందజేశారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు కుంద్ర రవీందర్‌రెడ్డి, గజవెల్లి ప్రసాద్, యూసుఫ్, చిట్యాల వెంకన్న, వంగల నర్సయ్య, తోట నర్సింగం, ఎల్లస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలో నేటి నుంచి రెండ్రోజులపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ నర్సంపేట డీఈ తిరుపతి, స్థానిక ఏఈ జోగానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. పాపయ్యపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లింగగిరి ఫీడర్ 33 కేవీ విద్యుత్ పునర్ధురణ పనుల నేపథ్యంలో శుక్ర, శనివారాల్లో మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు

నర్సంపేట : పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అడ్డూరి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం ఆర్డీఓ కార్యాలయ పరిపాలన అధికారి (ఏఓ) శ్రీనివాస్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. తొలుత ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. కార్మికులు దశాబ్దాలుగా కనీస వేతనాలు లేకుండా అధిక పని గంటలు పని చేస్తూ శ్రమదోపిడీకి గురవుతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడంతోపాటు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యూలర్ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరించిందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు భానోతు జవహర్‌లాల్, ఖలీల్, రాజేందర్, శ్రీరామోజు భద్రాచారి, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



ఏఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

'గీతాంజలి' సుబ్బారావుకు డాక్టరేట్

- నాణ్యమైన విద్య, అంకితభావమే కారణం

నర్సంపేట : చదువు భవిష్యత్ తరాలకు బంగారు బాట వేస్తుందని నమ్మిన సుబ్బారావు బాల్యం నుంచే చిత్తశుద్ధితో విద్యాభ్యాసం సాగించి ఉన్నత స్థానాలకు చేరుకున్నా వేలాది మంది విద్యార్థులకు అంతే శ్రద్ధతో విద్య అందిస్తున్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన వెనుకబడిన పేద విద్యార్థులకు పదో తరగతి వరకు తాను నెలకొల్పిన విద్యాలయాల్లో ఉచితంగా నాణ్యమైన విద్య అందించడమే కాకుండా పలు రకాల సామాజిక సేవలు అందిస్తున్న నేపథ్యంలో పట్టణానికి చెందిన గీతాంజలి విద్యా సంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావును ప్రభుత్వం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది.

అవార్డు నేపథ్యం..

దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఎంపికైన అనేక విద్యాసంస్థల నడుమ సుబ్బారావు నెలకొల్పిన గీతాంజలి విద్యాసంస్థలు ప్రాధాన్యతను సంపాదించాయి. దీంతో ఆయనకు 'సామాజిక విద్య–సేవా విభాగం'లో గౌరవ డాక్టరేట్ దక్కింది. అస్సాం, నాగాలాంగ్, మిజోరాం రాష్ట్రాల మాజీ గవర్నర్ జగదీశ్, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, మాజీ విదేశాంగ సహాయ మంత్రి మీనాక్షి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

కుటుంబం..

వేములపల్లి కమలమ్మ–వెంకటేశ్వర్‌రావు దంపతులకు జన్మించిన సుబ్బారావు ఖానాపురం ప్రభుత్వ పాఠశాలలోనే ప్రాథమిక విద్య పూర్తి చేశారు. ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేసి 1983లో ప్రగతి గురుకులం విద్యాలయాన్ని స్థాపించారు. నాటి నుంచి నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొంది విరమణ పొందిన తర్వాత కూడా రాష్ట్రంలో పలు విద్యాలయాలను నెలకొల్పారు. విద్యాభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్న సుబ్బారావుకు కేంద్ర ప్రభుత్వం డాక్టరేట్ అవార్డు ప్రకటించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.



సుబ్బారావును అభినందిస్తున్న జగదీశ్ ముఖి

బాధ్యత పెరిగింది


డాక్టరేట్ నా బాధ్యతను మరింతగా పెంచింది. పేద విద్యార్థులకు చదువును మరింత చేసే దిశగా సేవలు అందిస్తా. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకం, తల్లిదండ్రుల సహకారం మరువలేను. నా ద్వారా ఉన్నత విద్యను పొందిన అనేక మంది విద్యార్థులు అత్యున్నత స్థానాలకు చేరుకోవడం నాకు గుర్తింపు రావడానికి బాటలు వేసింది.

\- వేములపల్లి సుబ్బారావు

కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

ఖిలా వరంగల్ : పెట్టుబడిదారులకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. వరంగల్‌లోని రోటరీ క్లబ్ భవనంలో లక్ష్మణ్, బద్రి, అక్కెపల్లి రమేశ్, ల్యాదెల్ల శరత్, తోట చంద్రకళ అధ్యక్షతన గురువారం జరిగిన జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో విప్లవకారుల హత్యలను ఆపి శాంతి చర్చలు జరపాలని కోరారు. సీపీఐ ఆవిర్భవించి ఈఏడాది డిసెంబర్ 25 నాటికి వందేళ్లు కావొస్తున్న సందర్భంగా ఖమ్మంలో ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శి మేకల రవి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.విజయసారథి, నేదునూరి జ్యోతి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలి

నర్సంపేట : గ్రామాల్లో నెలకొన్న తాగునీటి, రోడ్లు, డ్రెయినేజీ, ఇతర అన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పరికి మధుకర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చెన్నారావుపేట మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక అధికారులకు, పంచాయతీ ఉద్యోగులకు సమన్వయం లేకపోవడంతో గ్రామాల్లో పారిశుద్ధ్య, ఇతర పలు సమస్యలు నెలకొన్నాయని చెప్పారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి దోమలు ప్రజలు రోగాల బారిన పడుతున్నా నివారణ దిశగా ఇప్పటివరకు ఏ ఒక్క గ్రామంలోనూ దోమల మందు ఫాగింగ్ చేయలేదని, బ్లీచింగ్ పౌడర్ చల్లలేదని తెలిపారు. వర్షాలకు గ్రామాల్లో దోమలు భారీ సంఖ్యలో పెరిగిపోయి ప్రజలు డెంగ్యూ, మలేరియా, తదితర జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గ్రామాల్లోని కాలనీల్లో బురదమయంగా మారిన రోడ్లకు మొరం పోయించి మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- పీహెచ్‌సీ వైద్యాధికారి అఖిల్

నెక్కొండ : కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని మండలంలోని అలంకానిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర (పీహెచ్‌సీ) వైద్యాధికారి అఖిల్ సూచించారు. మండలంలోని పెద్దకొర్పోలులో గురువారం నిర్వహించిన వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో డెంగీ, మలేరియా, తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని చెప్పారు. మురుగు కాల్వల శుభ్రంగా ఉండేలా చూడాలని, నిల్వ నిల్వలను తొలగించాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందుతున్నాయని చెప్పారు. అనారోగ్యం బారిన పడితే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిని సంప్రదించాలని కోరారు. తొలుత పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రమాదేవి, గ్రామ కార్యదర్శి నవీన్, కారోబార్ వెంకటేశ్వర్లు, ఆశ కార్యకర్త కవిత, తదితరులు పాల్గొన్నారు.



రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న అఖిల్

అవగాహనతో సైబర్ నేరాలకు చెక్

- ఏఎస్సై పీటర్

వర్ధన్నపేట : అవగాహన కలిగి ఉండడం ద్వారా సైబర్ నేరాలకు చెక్ పెట్టగలమని స్థానిక ఏఎస్సై పీటర్ తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాట్సాప్, ఫేస్‌బుక్ లాంటి సామాజిక మాధ్యమాల ద్వారా అపరిచితులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని సూచించారు. కొంత కాలంగా ఆన్‌లైన్ నేరాలు పెరుగుతున్నాయని తెలిపారు. ఆన్‌లైన్ వేదికగా సైబర్ నేరగాళ్లు అమాయకులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. స్మార్ట్ ఫోన్లు ఉపయోగించే యువత మరింత జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. సైబర్ నేరాల బారిన పడితే బాధితులు వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 1930లో ఫిర్యాదు చేసి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువత చైతన్యవంతమై సైబర్ నేరాలను అరికట్టడంలో ఇతరులకు అవగాహన కల్పించి ఆదర్శంగా నిలవాలని సూచించారు.



ప్రయాణికులతో మాట్లాడుతున్న ఏఎస్సై పీటర్

ప్రధాన రహదారి గుంతలమయం

- సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు రాజు

నర్సంపేట : నర్సంపేట నుంచి నెక్కొండకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయం అయ్యిందని, వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు కందికొండ రాజు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం సదరు రోడ్డులోని కాకతీయ నగర్ ప్రాంతంలో పడిన గుంతలను గురువారం సందర్శించి పరిశీలించింది. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. రహదారిలో వర్షం కురిస్తే గుంతల్లో నీరు చేరి రాత్రి సమయంలో గుంతలు కనిపించక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. వాహనదారులు గాయాల పాలవుతున్నారని చెప్పారు. అయినా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు గుంతలకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కలకోట అనిల్, ఫరీదా, వజ్జంతి, విజయ, ఉదయగిరి నాగమణి, బిట్ర స్వప్న, గణిపాక విలియం కేరీ, యాకలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



గుంతల వద్ద మాట్లాడుతున్న రాజు